# ధిక్కారం

తుమ్మేటి రఘోత్తమరెడ్డి

ఎండ తీవ్రంగా వుంది- బయట అడుగుపెడితే వేడిసర్రున నెత్తికెక్కుతోంది- పొద్దు కొంచెం వాలింది- ఎండకు బయపడ్తూ నెత్తిమీద పాత గుడ్డొకటి వేసుకొని, గుడిశెలోంచి రోడ్డు మీదకు వచ్చింది రాయమల్లి.

"ఎండబాగానే కొడ్తాంది- ఎండింట్లపీనుగెల్ల" అని కాస్త బయటకేఅనుకుని దృష్టిని కొంత దూరంలోవున్న మామిడిచెట్టు కిందికి సారించింది- ఆ హరిజనులకి ఎండ కాలంలో అదొక కల్పవృక్షం- బాలడు వాని కొడుకు తాళ్ళు పేనుతున్నారు- గూనిరామి ఈతకమ్మ నులుక పేనుతుంటోంది- ఇంకా కొంత మంది పోరగాండ్లు అల్లరి చిల్లరి ఆటలు ఆడుతున్నారు- రాయమల్లి వాలిన పొద్దుకు కుడిచేయి అడ్డంగా పెట్టుకొని రోడ్డు దిక్కు చూసింది- ఆ చివట్నుంచి దున్నపోతుల బండి ఒకటి రావడం కన్పించింది- బండిని పరికాయించి చూస్తూ....

"బండి రాజెల్లందే ఉన్నట్టున్నది" అని అనుకుంది. చూస్తుండగానే, దున్నపోతుల కొమ్ములు 'రాడి'కి తగుల్తోంట 'కట కట' చప్పుడు చేస్తూ.... సొట్ట గిరెల పాతబండి రాయమల్లి ఇంటి ముందుకు రానేవచ్చింది ...

"బండి ఊళ్ళెకేనా ? బిడ్డా !" అంటూ నుదుటికి ఆనించిన చేయి తియ్యకుండానే అడిగింది రాయమల్లి.

"ఆ(.... ఊళ్ళెకేనే పెద్దవ్వా ..." అన్నాడు రాజెల్లడు.

"నీ బాంచెన్.... కస బందాపు- మాయి గిన్ని వడ్లిస్తలున్నయ్ బండ్లేత్త దొర సానికి పెట్టాలె" అంది రాయమల్లి.

---



టాక్టరు యజమాన్లకే
టాకుటీకు పెంచునిన్న
జిన్నర్లా, స్పిన్నర్లా
జిల్లాల్లో తేలునిన్న
భూస్వామికి, బోకర్లకు
బ్యాంకిల్లో మోగునిన్న

మీరువాళ్లా దొర్లునిన్న
విన్నిట్టా ఆడిచ్చే కిలాడీ పాలకులను
పోరులోన గెలిచి - నిన్న
ప్రజల పరం జేస్తనే
మంచిజేస్తనె పొడుగుపత్తే- నీకూ
వన్నె దెస్తనె పొడుగుపత్తే

"సరె ఎయ్యవే.... జెప్పన పోవాలె- కమ్మలు మంచిగలెవ్వు"- అన్నడు రాజెల్లడు.

"ఎన్ని బిడ్డా! రెండు గిద్దెలేకాదు- పండినయా గివ్వి, ఆ మెకు పెట్టేటియా గవ్వి- కస బండిదిగి రారాదు బాంచెన్, ఇంట్ల సమ్మడొక్కడే ఉన్నడు- ముల్లెలు మా ఇద్దరికి లేవయి-" అంటూ బతిమిలాడింది- రాయమల్లి.

"సరె పాయె...." అంటు పగ్గాలు గట్టిగ గుంజి గుజ్జుకు కట్టి బండి మీదినుంచి దిగిండు- ఎండకు దున్నపోతులు 'గస్....గస్....' మంటూ ఒగరుస్తున్నాయి.

"రాజెల్లన్న బండి ఊళ్ళెకేనట పోతాంది- జెరలేర 'సమ్మ' వాదుకూడ అచ్చిందు బండాపి, ఇద్దటుగల్సి బండ్లేత్తురుగని" ఇంట్లోకి వచ్చి గడంచెల ఒరిగిన కొడుకును లేపింది రాయమల్లి.

"ఆకిట్లనే ఆగిందానే- అవ్వా- బండి?" మోసుకుపోవుడు తప్పినందుకు సంతోషంతో తొందరగ లేచిండు సమ్మడు.

"ఆఁ ఆకిట్లనే ఆగింది" అని దర్వాజబయటనే ఉన్న రాజెల్లన్ని ఉద్దేశించి "రా-రా-దు బిడ్డా లోపల్కి-- గిన్నె వున్నయ్ నాలుగు ముల్లెలు" అంది- రాజెల్లడు వంగి గుడిశెలకు వస్తూ....

"ఎక్కడున్నయే పెద్దవ్వా.... ముల్లెలు.." అన్నడు ఎండలోంచి చీకటింట్లోకి రావడం మూలంగా ఏమీ కన్పించలేదు రాజెల్లనికి.

"కండ్లు కనిపిత్తలేవుర?" అంటూ పరాశికమాడిండు సమ్మడు.

"ఎట్ల కనిపిత్తయిరా....? కొత్తపచేల్దారికె" చురక అంటించినట్టు అన్నడు రాజెల్లడు.

"ఆఁ.... ఏం కొత్తపచేలు...." ఏ మొగనికి పోయినా పొయ్యి ఊదుడు తప్పనట్టు ఎవలకున్నా సేసుడు తప్పుద్దాబిడ్డా?" అన్నది రాయమల్లి ఇద్దరికి కలిపి మూట ఎతటంలో సాయం చేసూ.

"సూర్యాపాలు ఎక్కువిత్తనన్నడటకద! సెట్టువడి కింద నిజఁవేనా? పెద్దవ్వా." అని అడిగిండు మూట బండ్లోవేసి వసూ.

"ఆఁ.... బిడ్డా దొర్సానికి గందుకనే కోపం- సమ్మని వంతుకు పాలేరెవలు

"ఎట్ల దొరుకుతరే పెద్దవ్వా! నీదాంచెనైతె, దొర్సానంటె ధర్మతల్లాయె, కొడుకింటె ధర్మరాజాయె, దొరకడు మరి–" అన్నడు రాజెల్లడు.

"ఎడబోతె మనకేంది బిడ్డా" అంటూ తలుపేసి గొళ్ళెంపెడ్తూ "నేను దొర్సానింటికి వడ్లువెళ్లవోతాన– కోడిపిల్లలు పదిలం, పొద్దున్నే బంగారంవసోంటి పిల్లను గద్దెత్తుకుపోయింది, దానింట్ల పీనుగెల్ల, సాది....సాది దాని బొందమీద వెట్టుడైతాంది", అంటూ యోరపాకల చెప్పులు ముడుసుకుంటున్న మొగనుద్దేశించి చెప్పింది రాయమల్లి– అరిగిన తోలుచెప్పులు వేసుకుని బండివెనుక బయల్దేరింది రాయమల్లి– సమ్మడు, రాజెల్లడు ఏవో–ముచ్చట్లాడుతూ.... బండిమీద వెల్తున్నారు– 'కట–కట–' కొమ్ములచప్పుడుతో బండి నెమ్మదిగా కదుల్తోంది– రాయమల్లి మామిడిచెట్టు కింద ఆడుకునే పోరగాండ్లకేసి బయం, బయంగ చూసింది చిన్నకొడుకు సారడు వెంట బడ్తడేమోనని– వాడు చూడనే చూసిండు– "అవ్వ నేనత్త.... నేనత్త...." నంటూ మొలకు వున్న ఇత్తడిగజ్జెలు 'ఘల్.... ఘల్....' మంటుంటె.... రాయమల్లి దగ్గరికి పరుగెత్తుకొచ్చిండు.

"అద్దు బాంచెన్ ఎండ బాగకొడ్తంది– కాళ్ళుకాల్తయ్ ముడ్డికి లాగుపేగన్న లేదు. 'సిడిమెల' రానూ....?" అంటూ మురిపెంగా కొడుకు గదువ పట్టుకుని బుజ్జగించ చూసింది– వాడు కాళ్ళుచేతులు 'తప–తప' లాడిస్తూ భూపాల రాగం అందుకునేసరికి 'ఇగ లాభం లేద'నుకొని.

"బండాపురా.... సమ్మవ్వా– పీడత్తనని లొల్లిపెడ్తాండు" అంది రాయమల్లి. అనుకుంటనే వాన్ని చంకనేసుకుని బండి దగ్గరికి పరుగెత్తుతూ.

"వాడెందుకే మల్ల?" అంగిలేదు లాగులేదు కసిరిండు సమ్మడు– మూతి ముడుసుకున్నడు 'సారడు' కారిన చీమిడిని 'సర్....న' ఎగబీల్చి వడ్లముల్లెల మీద బండి చాటువ తాళ్ళు పట్టుకొని కూర్చున్నడు.

"పడ్తవు బిడ్డో! గట్టిగవట్టుకో" అన్నది వెనుకనడుస్తూ రాయమల్లి.

బాకీగా తెచ్చుకున్న వడ్లు, వాటికి పెచ్చులు కలిపి ఎంత అవుద్దో మరోసారి లెక్కపెట్టుకుని 'పంటలు నిరుడు లేకనేపాయె పెచ్చుకడుతాదా నిరుటికి? ఏమో....? పాలేరు ఉండలేదన్న కోపం– 'నలుగురితోటి నారాయణా, ఆమె ఒక్కతే ఏరంటె కలుత్తదా?'– అనుకుంటూ వచ్చేసరికి ముల్లెలు దొరసాని ఇంటిముందు దించి బండి వెళ్ళిపోతోంది.

"కచ్చీరు ఇంటిముందల, పందిరికింద వెట్టిన్నే అవ్వా ముల్లెలు- నేనువోతాన- రామిరెడ్డి దొర కోప్పడుతడు, పొద్దువోతె- దొరసానికి కన్పిస్తె పాలేసు ఉండలేదని ఏమేమి అంటదో అని వానిబయం వానిది."

సరెపో- బిడ్డా- పో- నేనే కొలిసి 'గడెకాల వోసిఅత్త' అని 'సారని' చేతిని ఒక చేత్తోపట్టుకుని పాటకులు దాటి ఇంటి పెద్దదర్వాజ ముందుకు వచ్చింది- బాగా అల్లుకుపోయిన సన్నజాజిపందిరి నీడ ఇంటిముందు చల్లగా ఉంది- పక్కన రేకుల షెడ్డు చూరుకింద సంకరోడొకడు కునికిపాట్లు పడ్తున్నాడు- మోకాళ్ళమీద తల ఆనించుకుని. రాయపల్లి హృదయం 'ఝట్కు' మంది కుక్కగాని ఉన్నదో ఏమోనని, ఎక్కడా.... కుక్క లేదని నిశ్చయం చేసుకున్నాక, తలుపులు చేరవేసి ఉన్న పెద్ద దర్వాజ దగ్గరికి మెల్లగావెళ్ళి- అంతకంటె మెల్లగా లోపలికి తొంగిచూసింది- 'పెద్ద షెగేదారు' నర్సింహరామయ్య కింద చాపవేసుక్కూర్చుని ఏవో లెక్కలు రాస్తూఉన్నడు-

పీనింట్ల పీనుగెల్ల అన్ని దొంగ లెక్కలేచేసేది కసిగాఅనుకున్నది రాయపల్లి. ఇంటిదగ్గర కోడిపిల్లలు జ్ఞాపకం వచ్చినయ్.

అయ్యా- అని నర్సింహరామయ్యను ఉద్దేశించి పిలిచింది. ముక్కుమీదకి జారిన కళ్ళద్దాల్ని ఎడమచేతి చూపుడు వేలితో పైకి ఎగదోసుకుని

ఎవరే....? అన్నాడు కొంచెం నుదురుచిట్లించి ప్రశ్నార్థకంగా.

ఆఁ....ఆఁ అట్ల నిలబడవే దొర్సానికి చెప్పివత్త- అనుకుంట లేచి గోచి దులుపుకుంటూ ఇంట్లోకి వెళ్ళిండు నర్సింహరామయ్య- పెద్దర్వాజ దగ్గర్నుంచి కొంచెం వెనక్కిజరిగి ఓమారు వీధిలోకి తల తిప్పిచూసి పందిరి గుంజకానుకుని, దర్వాజ కభి ముఖంగా నిలబడింది రాయపల్లి- వడ్లముల్లెల మీద సారడు కూర్చున్నడు. రాయపల్లి చూపు దర్వాజపైని ఆనింది.

లతలు చెక్కి ఇత్తడి పువ్వులు తాపడంచేసి అందంగా రంగులు వేసిన పాత కాలపు దర్వాజ అది.

'ఈ దర్వాజను అమ్మకుంటె మా అసోంటోళ్లకు ఓ ఇల్లైద్ది- అయినా ఏం? కష్టపడి సంపాయించినాని ఎంది? జెర్రికి సీమలు తలిగినట్టు 'కొట్టరాని.... కొట్టరాని' అంటే వందల మంది 'కైకిలి' లేక వస్తేశిందుని- గిప్పుడైతెనా? ఎహే.... ఒక పురుగ్గూడ వోకపోదురు- పెయినా సంఘపోళ్ళు ఊకోకపోదురు- బరాబరి కైకిలి తీసుకోని యాళ్ళప్రికారం పస్తేస్తరు- అంత ఎమకటిక్కాలం, ఎర్రికాలం, ఎడ్డికాలం,

గనుక చెప్పినట్టు సాగింది- 'గుర్రాన్ని పట్టుకుని గాడిద అంటె, గాడిదే అన్నారు, గుర్రంరా అంటె గదే బాంచెన్' అన్నారు- ఇప్పుడు కూడ మాలాప్పపోకడ పోవన్నని సూత్తరుగని గవన్నీ గిప్పుడేం సాగుతయి- ఆ రోజులు ఎన్నడో పెయినయ్- అదేందో 'ముచ్చట సంబురాన దొంగతిండి మర్సినట్టు'- కోడిపిల్ల లుండెనో పాయెనో ? ఈ దొర్సాని ఎంతకు రాదేంది ? పగటినిద్ర పెయిందా ? ఏంది ? లేసి మొఖం కడుక్కోని మల్లేం తింటదో ? ఏం తాగుద్దో ? తినుడు తాగుడు మంది కొంపర్దీసుడు, ఇంకేంపని అని అనుకుంటున్న రాయమల్లి ధోరణి కిర్రు....మన్న తలుపు చప్పుడుతో ఆగింది- వంటమనిషి గురవయ్య బయటికివచ్చి "వస్తోంది" అన్నట్టు ఓమారు రాయమల్లికేసి తల తిప్పి పక్క కచ్చేరింట్లో ఉన్న పట్టెమంచం వాల్చి లోపలికెల్లాడు.

"ఏం తేదావెత్తదో ? ఎన్నివెట్టన్నంటదో ?" అని రాయమల్లి అనుకునేలోగానే చేతికర్ర 'టక టక' లాడిస్తూ.... పీతనడక నడుస్తూ.... ద్వేషపూరిత చూపుల్తో రాయ మల్లిని చూస్తూ కచ్చేరింట్లోకి వెళ్ళి మంచంలో కూర్చుంది దొర్సాని- దొర్సాన్ని చూడ గానే గుంజకు వరిగినిలబడ్డ రాయమల్లి, మంకరి వాడలాగే చక్కగా నిలబడ్డది, కాస్త భయంగ.

"లెక్కజూసుకొనేరోజు మొన్ననేనని ఎరికేలేనమ్మా ?" అంది దొర్సాని వ్యంగ్యంగ

"ఎరికే బాంచన్.... మొన్న పండుగనిరాలేదు," నసిగింది రాయమల్లి.

"నిన్నేమైంది ?"

"నిన్న గిపోరడు ఈతకు బోయిన పోరిగాండ్ల తోటి ఈతకుబోయి బాయిల వడ్డడు బాంచన్. ఇగ ఆ గందరగోళంలవడి రాలేదు" కొడుకు తల నిముర్తూ సంజా యిషీ ఇస్తున్నట్లు అంది రాయమల్లి.

"ఊం.... మొన్నపండుగ, నిన్న పోరడు బాయిలవడ్డడు, బాగనే ఉన్నది- ఇయ్యాల ఎండబాగున్నదని ఇంట్లనే ఉండకపెయినవా ? ఆం....ఇచ్చినోడు సావాలె.... కాయిదాలు కాలాలె.... అవునే ! అంది దొర్సాని చేతికర్ర రెండు చేతుల్తో ఊపుకుంట.

"గట్లెందు కనుకుంటం బాంచెన్ ఇయ్యాలగాపోతె రేపు గంతేకని, నెల్లు గడుత్తయా....? ఏండ్లు గడుత్తయా ?...." అంది రాయమల్లి.

అంతట్లోకే లెక్కకాగితం పట్టుకుని నర్సింహరామయ్య- కుంచం అంచెలు పట్టుకుని గురవయ్య వచ్చారు- చెద్దర్లలోపటి వడ్లముల్లెలువిప్పి, వడ్లు కుప్పగాపోసింది

రాయమల్లి- కచ్చేరింట్ల మంచంలోకూర్చున్న దొర్సాని కింద వాకిట్ల కుప్పగాపోసిన వడ్లను చూస్తూ....

"ఏందే రాయమల్లి.... కళ్ళాలపొంట ఊడ్చుకచ్చినయ్, ఆడీద అడుక్కచ్చుకున్నయి, కైకిల్లు, అన్నికలిపి కులానికోఇత్తు కలిపి పట్టుకరాకపెయినవ్ !" అంది.

గవ్వి మాకెక్కడియి బాంచెన్, దొయ్యాల పండినయోగవ్వి ఆడికాడికి తంవరి మందమైనయి- కల్లి లేక. కసాబు లేక రాజనాల్లెక్క- ఉన్నయ్ వడ్లు" అంటూ కుడి చేత్తో కొన్నివడ్లు పట్టుకుని సుంకరికి చూపిస్తూ "లెవ్వే బాలన్నా....?" అని అంది- 'అవునో, కాదో ఏదీ అర్థం కాకుండ వాడు తలకాయ ఊపేసిండు కుంచం పట్టుకుని దొర్సాని వంక చూసిండు గురవయ్య- కొలవమన్నట్లు కళ్ళతోనే అనుమతించింది దొర్సాని. సుంకరి అంచెతో వడ్లు కుంచంల పోస్తుంటెం గురవయ్య ఆ వడ్లని అదిమి అదిమి కొలుస్తూ అంచెలో పోస్తున్నాడు- రాయమల్లిని కుంచాన్ని పరీక్షగా చూస్తూ.... "ఈ కుంచంతో నాకియ్యలేదు దొర్సానీ, ఇయ్యంగ-" అంటూ దొర్సానివంక ఫిర్యాదిగా చూసింది.

"కండ్లు తిర్గినాయె ? అఁ.... ఇచ్చేటప్పుడో కుంచం, తీసుకువేటప్పుడో కుంచం పెట్ట ఇదేంవన్న కోంవటోల్లను కున్నవా ? లేక నువ్వువెట్టే వెయ్యిసూరుపుట్ల వడ్లబాకికి పెద్దకుంచం పెట్టిస్తనుకున్నవా ? ఏంది ?" ఉరిమింది దొర్సాని ముఖం ముడుసుకుంది రాయమల్లి- అంచెలునిండినయ్ అంచె రాయమల్లి కెత్తిండు సుంకరి.

"పీల్లింట్ల మన్నువడ- పీల్లపీనుగులెల్ల గిట్లజేసి గిట్లజేసే సంపాయించిన్రు" అనుకుంటూ గరిశెలో పోసివచ్చింది- కొలత కొలిచిన గురవయ్య లేస్తూ....

"ఇపస తక్కువ రెండుగిద్దెలు దొర్సానీ" అని క్రింది వడ్లిత్తులు నాలుగుతీసి కుంచంలవేస్తూ అన్నాడు గురవయ్య.

"నర్సింహరాంవయ్యా లెక్కెంతున్నదో సూడు...."

సూసిన్నమ్మా మొత్తం నాలుగు గిద్దెలు, ఇంక రెండుగిద్దెల రెండు కుంచాలు రావాలె" అన్నడు కాగితం చూస్తూ.

ఇంటికాడ కొల్సుకొచ్చిన కాదు బాంచెన్- ఇటీత్తు అటువడకుంట రెండు గిద్దెలు అయినయ్ ఈడ ఇరున తక్కువంటె ఎట్ల దొర్సానీ ?" అంది రాయమల్లి.

పెద్ద కుంచం బెట్టిచ్చిన్నా, లేక లెక్కతప్పువెట్టిచ్చినా.... అఁ.... నువ్వీన్నే వున్నవ్గదనే ముండా.... అంది దొర్సాని ముఖం చిట్లించి.

ఆఁ.... కొలిసినంక పోంగాండ్లు కోడవటింటికో, మొగడు గొండ్లింటికో పోసుక పొయ్యి ఉంటవు అందుకే తక్కువచ్చినయ్ కిటుకు కనిపెట్టినట్టు తేల్చిపారేశాడు నర్సింహరామయ్య.

ఎట్లైతె మాంకేదిగని కడమ మూడుగిద్దెలిరుసవెట్టి ఈనున్నంచి కదులు- దొర్సాని. రాయమల్లికేం అర్థంకాలేదు- భయం మాత్రంపేసింది- ఇంక మూడుగిద్దెలిరుసా.... గవన్నెక్కడియి దొర్సానీ అంది రాయమల్లి.

ముందటేడు గిద్దెడు వడ్లు కొంచబోయినవు- గిద్దెకు గిద్దెడు పెచ్చు కడితె రెండు గిద్దెలు, ఈ ఏటికి ఆరెండు గిద్దెలకి మర్రో రెండుగిద్దెల పెచ్చు కడితె నాలుగుగిద్దెలు.... సరెనా.... అంటూ నాలుగువేళ్ళు చూపిస్తూఅన్నాడు నర్సింహరామయ్య, పళ్ళుబిగించి అవునన్నట్టు తల ఊపి దొర్సాని అంది.

కొడుకు పెండ్లంటె గిద్దెడు ఇచ్చిన అవి ఇండ్లకిల్లుపుకుంటెనే.... మొత్తం మూడుగిద్దెల ఇసన అంటూ తల నిలువుగా ఊపింది తలమీది గుమ్మడికాయంతసిగ గమ్మత్తుగ ఊగుతుంటె చూసిని నొరడు, రాయమల్లి తలకేసి చూస్తె చింపిరితల్లో ఎక్కడో పెల్లుల్లిపాయంత సిగ కన్పించింది వానికి- మార్చి మార్చి చూడ సాగాడు.

పెండ్లంటె గిద్దెడు వట్టిగనే ఇత్తిరి మల్ల పెట్టుమంటె ఎట్ల దొంటేన్ అంది రాయమల్లి.

కంచంల పోసినయి తప్పుతయ్గని, కుంచంలవోసిన తప్పుతాయె అన్నాడు నర్సింహరామయ్య- 'సరే'నన్నట్టు తలవూపింది దొర్సాని.

పెచ్చుకు కొంచవోయిన యాడాది పంటలు లేనేలెవ్వాయె పెచ్చెట్లకడుతరు దొర్సానీ.... రామిరెడ్డి దొర వారి పాతపాలేర్లకు కట్టలేదట అంది రాయమల్లి.

హయ్యో....రాత ఇయ్యాల రామిరెడ్డి దొర మంచి మొగడయ్యిండే- జీతాలుఎక్కు విత్తడు పెట్టువడీ ఎక్కువిత్తడు ఆఖరికి గు....మీద ఎక్కుపే తంతడు- అన్నీట్ల మాకంటె ఎక్కువేనే అందుకే కొడుకును కొంచవోయి ఆయన కుంచినవా? గడ్డటోటువెడితె కుక్కన్న తోకాడిత్తదిగని, గంతకంటె కూడ సమ్మకం లేనోల్లు అయిండ్రే- పాతసీరలిచ్చింది పెయిండి- పచ్చళ్ళు పెట్టింది పెయిండి- పూటకు రెవ్వంటె తప్పేడు మానెడు ఇచ్చింది పెయింది గంగలకల్సి- ఇయ్యాల రామిరెడ్డి దొర మంచి మొగడయిండంటే కాదుమరి ? దొర్సాని సాధింపు.

బాయిల పనికి పోతనని, వాడేపొయ్యి అయిదువందలు అడుక్కచ్చుకోని గోదా

వరిఖన్లె వాళ్ళ సిన్నయ్యకిచ్చి అచ్చిండట బాయిల పనికోసం ఎవలకైసె లంచమియ్య్యమని- తనదేం తప్పులేనట్టు అంది రాయమల్లి.

బాయిల పని.... బాయిల పని ఎవలకెపకలేందే? ఆడ మాతమ్ముడు ఓర్మెస్సి పస్జేయ్యనేవట్టె- మడుగుల దున్నపోతుకంటె అధ్వాన్నంగ మసిలదొర్లచ్చి నెలకు అయిదారువందలు మాఇత్తాండ్రు- అంది దొర్సాని.

ఏమో! నాగ్గవన్ని తెలువయ్ బాంచెన్.... నేనెంత అద్దన్నా నామాట ఇనలేదు. నా సేతులున్నడా! వానిట్టం వానిది.

సంసారిపైతివి గివన్ని సీకెందుకెరుక వాన్ని మాకుండ కుంట చేసింది నువ్వె కాదెలంజె- అంది దొర్సాని- రాయమల్లికి కోపంవచ్చింది.

అచ్చినప్పట్నుంచి సూత్తాన.... బాంచెన్నైదు- లంజె, లౌక, ముండ. గిండ అని తిడ్తానవు సెవులు పిండి నియ్యేనువ్వు వసూళ్లేసుకోగని తిట్టకు- అంది రాయమల్లి.

"నర్సింహరామయ్యా ఇనూ.... ఆ దొంగ లంజె బలుపు మాటలు" అంది దొర్సాని- వింటున్నానన్నట్టు తలూపాడు- నర్సింహరామయ్య.

"పనీ పాట లేకుంట రోజుకు మూడుసార్లు తింటాయె బాంచెన్ ఉదీ ముండని మెంచేనాయె ఇగ బలుపురాకేం జేత్త." అంది రాయమల్లి-

దొర్సాని ముఖం నల్లబడింది అప్పుడే పగటి నిద్రలేచి బయటకువస్తున్న దొర్సానికొడుకు జగదీశ్వర్రావుకు, చెట్టంత తన తల్లిని పట్టుకొని ఓమాదిగ ముండ అంతేసి మాటలనడం విన్పించేసరికి 'సర్రున' కోపం వచ్చింది- వచ్చిందే తడవు రాయమల్లి వీపిమీద ఎడాపెడా దెబ్బలు వేశాడు- దొర్సాని కొద్దిగా ఆశ్చర్యపడినా 'మంచిపనే' అని చప్పుడు చెయ్యకుండా చూస్తుంది- దెబ్బలుతిన్న రాయమల్లి శరీరం మంటచేసింది హృదయం కుత కుత ఉడికింది కోపం ఆపలేకపోయింది- భయం గియం రాయమల్లిని చూసి బయపడి పారిపోయింది.

"నీయింట్ల పీనుగెల్లగదరో.... నీచేతులు పడిపోనుగదరో అన్యాలంగ నన్ను కొడితివి గదరా గాడిదికొడుకా" అంటూ తిట్టుకుంటు ఏడుస్తోంది- తల్లికాలు పట్టుకొని సారడు ఏడుస్తున్నాడు- జగదీశ్వర్రావుకి, ఆ తిట్లకి మరింత కోపం వచ్చింది- నానా బూతులు తిడ్తూ మళ్ళీ చెయ్యెత్తాడు- నర్సింహరామయ్య అడ్డుపడబోతె ఆ దెబ్బ ఉన్న పళంగ నర్సింహరామయ్య దవడకు అంటింది- అసలే బోసి నోరు- దవడపట్టుకొని పక్కకు జరిగాడు- రాయమల్లి తిడ్తూఏడుస్తూ.... ఏడుస్తున్న కొడుకును ఏడ్వకురా ఏడ్వకు....అంటూ ఓచేత్తో వాన్ని పట్టుకుని 'బర బర' లాక్కెళ్తూ 'పాటకు'లుదాటింది.

ఫోనియ్యకురా.... లంజెన్- పట్టుకోరా సుంకరోడా- గుంజకు కట్టెయ్- 'బాంచత్' ఎవడడ్డం అత్తడో సూత్త.... అక్షరాల్ని పత్తిపలుకుతూ కోపంగాఅన్నడు జగదీశ్వర్రావు- సుంకరోడు అలాగే నిలబడకుండ నాలుగడుగులు వేశాడు- పాటకులు దాటి వెల్తున్న రాయమల్లి ఆగి,

"కట్టేయించుతవురా గాడిదకొడకా....కట్టేయించుతవ్- ఏపాటి కట్టేయించుతవో. అత్తరు- కట్టేయించురా గప్పుడు నీమొగతనం తెలుత్తది.. ఆడిముండను నన్ను ముట్టుకున్నపుగని ముట్టుకున్నందుకు, ముట్టుకోని తన్నినందుకు నువ్వు వడ్లకు పెచ్చులుగట్టి సెట్టుకట్టి తన్నిత్తరా కుక్కలకొడ్కా, ఆఁ....ఏఁవనుకున్నవో- ఇంకా ఏమేమో....తిడ్తూ వెల్తోంది పెద్ద పెద్ద అంగలేస్తూ, వెనుక సారడు గబ గబ పరుగెంటు తిరిగి చూసూ చూసూ.

ఎవరో రాయమల్లికి ఎదురై "ఏమిట"ని ప్రశ్నించారు. ఏడుస్తూ ఆపెద్దమనిషికి చెపోంది మధ్యమధ్యతిడ్తూ. దొర్సాని జగదీశ్వరరావు, గురువయ్య, నర్సింహరామయ్య, సుంకరోడు అందరూ రాయమల్లి కేసే చూస్తున్నారు. గాలివాటానికి రాయమల్లి అట్టెతిట్లన్ని వింటూనే ఉన్నారు. వినవలసిన వారి ముఖాలు కంద గడ్డల్లా అవుతూనే ఉన్నయ్. క్షణం ముందు జరిగిన గలటా విని జగదీశ్వర్రావు భార్య ఏదో అల్లిక పని చేసుకుంటూ బయటకు వచ్చి జరిగింది తెలుసుకుని వెంటనే కోపంతో. "రామిరెడ్డి మొన్న-పాలేర్ను ఏదోమాట అన్నందుకే సిల్లర జనమంత ఏకమై పని పాటలు నెల రోజుల్దాక బందు వెట్టిచ్చిండ్రు. కొట్టెటోళ్ళకు బుద్ధి లేకున్న చూసెటోళ్ళ కన్ను వుండద్దా?" అంటూ [illegible]గారి వంక చూసింది శాసడింపుగా, ఇంకా ఆ పెద్ద మనిషితో చేతులు తిప్పుతూ ఏదోఏదో చెప్తోంది రాయమల్లి. దొరసాని ఇంటికి ఎదురుగా తల్లి పక్క నిలబడ్డ సారిడు, విల్లులా వెనక్కి వంగి, వంకరగా చిమ్మే ఫౌంటెన్ లాగ మాత్రం పొయ్యడం దొరసానితోపాటు అందరూ చూస్తున్నారు. 'రంకుల గాడ్దికొడుకు కసిగా అనుకుంది దొర్సాని. సారిడు మూత్రం పోసి కసిగా కోపంగ ఓమారు చూసి వెల్తున్న తల్లి వెనుక పరుగెత్తసాగిండు ...

కథలు శీర్షిక కింద ఈ సంచికలో వేయదల్చుకొన్న

అల్లం రాజయ్య

కథ

**మార్పు**

వచ్చే సంచికలో వస్తుంది.